
పీణ్యా పారిశ్రామిక కేంద్రం

పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం

- పారిశ్రామిక రంగంలో నెలరోజుల్లో కొత్త పాలసీ
- గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌తో అంతర్జాతీయ కంపెనీల ఆకర్షణ
- ఉద్యోగాల్లో మహిళలకు ప్రాధాన్యం


పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్

బెంగళూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఐటీబీటీ, ఏరోస్పేస్ రంగాల్లో తిరుగులేని రీతిలో ప్రగతి సాధిస్తున్న రాష్ట్రం ఇతర ఉత్పాదనా రంగాల్లోనూ గణనీయమైన కృషే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఆ దిశగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్ (జిమ్) ద్వారా అంతర్జాతీయస్థాయి కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు తీవ్రమైన కసరత్తు చేస్తున్నారు. ఇటీవల కొన్ని నెలల వ్యవధిలో భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ వివిధ దేశాల్లో పర్యటించి పారిశ్రామిక నిపుణులను ఆకర్షించే దిశగా రోడ్ షోలు కొనసాగిస్తున్నారు. ఐటీబీటీతోపాటు భిన్నమైన పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉండాలనే సరికొత్త పాలసీని తీసుకొచ్చేందుకు సిద్ధమయ్యారు. మరో నెలరోజుల్లోనే కొత్త పాలసీ తీసుకురాదలిచినట్లు తెలుస్తోంది. గడిచిన కొన్నేళ్లతో పోలిస్తే ఇటీవలికాలంలో పొరుగు రాష్ట్రాల నుంచి పారిశ్రామికవేత్తల ఆకర్షణకు పోటీ పెరిగిందనే అభిప్రాయాన్ని రాష్ట్ర పరిశ్రమలశాఖ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అందుకే కొత్త పాలసీని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. క్విన్‌సిటీ, రెండో అంతర్జాతీయ విమానాశ్రయం, సిలికాన్ స్టేట్ వంటి ప్రాజెక్టులను రూపొందించడం ద్వారా దిగ్గజ కంపెనీలను ఆకర్షించనున్నారు.

పెట్టుబడుల సాధనకోసం పారిశ్రామిక పాలసీ ఏర్పాటుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారు. అన్ని విభాగాల్లోనూ పెట్టుబడులు సాధించడమే కమిటీ లక్ష్యంగా ఉంది. ఇందుకోసం వారు నిరంతరంగా జిల్లాలవారీగా ఏ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని నిర్ణయించి సంబంధిత పరిశ్రమలు ఏ దేశంలో పేరొందాయో వాటిని గుర్తించి రప్పించే ప్రయత్నం చేస్తున్నారు. బెంగళూరుకే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు రిజిస్ట్రేషన్ల విభాగానికి వందశాతం రాయితీ ఇవ్వడం, ఐదేళ్ల వ్యవధికి ఉచిత విద్యుత్, గ్రీన్‌కారిడార్‌లు సృష్టించడం, పరిశోధనలు, ఆవిష్కరణ కేంద్రాల ఏర్పాటు, స్టార్టప్, ఎకో సిస్టమ్, ఎంఎస్ఎంఈలకు సహకారం, క్లస్టర్‌ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మహిళా ఉద్యోగుల శాతం రానున్న ఐదేళ్లలో కనీసం 5-6శాతం పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకోసమే 50మంది మహిళలు ఉండే కంపెనీలకు 7.5శాతం, 70మందికిపైగా ఉండే మహిళలకు 15శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో పెట్టుబడుల సమావేశం 'ఇన్వెస్ట్ కర్ణాటక 2025' ఫిబ్రవరిలో జరగనుంది. అంతర్జాతీయ స్థాయి కంపెనీలను ఆకర్షించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. మరోవైపు ఫిబ్రవరిలోనే ఆసియాలోనే అతిపెద్ద ఏరో ఇండియా ప్రదర్శనలు జరగనున్నాయి. వైమానిక, రక్షణ రంగాలకు సంబంధించిన ప్రముఖ కంపెనీలు ఇక్కడ ఒప్పందం చేసుకునేందుకు సిద్ధమవుతున్నాయి. ఇలా మరో రెండు నెలల్లో రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులకు అవకాశాలు ఉంటాయని భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ అభిప్రాయపడ్డారు. ఇన్వెస్ట్ కర్ణాటక 2025కు అనుగుణంగా కొత్త పారిశ్రామిక పాలసీని జనవరిలో విడుదల చేస్తామన్నారు. కర్ణాటకలో పెట్టుబడులకు భిన్నమైన ఉత్పాదనా రంగాల ప్రముఖులు సుముఖత చూపడం సంతోషంగా ఉందన్నారు.

ప్రగతే ప్రధాన ఆశయం

ఉత్పాదనారంగానికి ప్రాధాన్యం ఇస్తూ 12శాతం ప్రగతే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐదేళ్లలో 7.5లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు సాధించాలని భావిస్తున్నారు. తద్వారా 20 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేశారు. పారిశ్రామిక అభివృద్ధితో ప్రాంతీయ సమానత్వం కూడా సాధ్యమవుతుందనేది ప్రభుత్వ ఆశయం. అందుకే పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి సింగిల్ విండో విధానంతో అన్ని వ్యవస్థల అనుమతులు కల్పించనున్నారు. ఇందుకోసం నోడల్ అధికారులను నియమించడం ద్వారా 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను పెంచనున్నారు. ప్రభుత్వం అకడమిక్ సహకారంతో నైపుణ్యత కల్పించి మానవ వనరులను సంసిద్ధం చేసుకోనున్నారు. పెట్టుబడి ఆధారిత రాయితీలు ఉత్పాదనా రంగంలో ప్రోత్సాహం ద్వారా వెనుకబడిన జిల్లాలను పారిశ్రామికీకరణ చేయనున్నారు.

మూడు డివిజన్లుగా ఏర్పాటు

బెంగళూరు జిల్లాలో పరిశ్రమలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లాలనే డిమాండ్ పెరుగుతోంది. అందుకు ప్రభుత్వం కూడా మూడు డివిజన్‌లుగా ఏర్పాటు చేశారు. బెంగళూరు నగర, బెంగళూరు గ్రామీణ జిల్లాలు ఒక డివిజన్‌గాను, ఉడుపి, మైసూరు జిల్లాలు మరో డివిజన్‌గాను, కొడగు, ఉత్తర కర్ణాటక జిల్లాలను ప్రత్యేకంగా నిర్ణయించారు. దీన్నిబట్టి ప్రాంతాలవారీగా రాయితీల్లో కూడా తేడా ఉండనుంది. తద్వారా బెంగళూరు మినహాయించి ఇతర ప్రాంతాలవైపు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వెళ్తారని ప్రభుత్వ ఆశయంగా ఉంది.


కుక్కె ఆలయం వద్ద కుటుంబీకులతో మంత్రి ఈశ్వర్‌ఖండ్రె

ఆ నివేదికను తిరస్కరించాం

- రైతు హక్కుల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం
- తేల్చి చెప్పిన అటవీశాఖామంత్రి ఈశ్వర్ ఖండ్రె

బెంగళూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పశ్చిమకనుమలకు అనుబంధంగా అటవీ భూముల ఆక్రమణలకు సంబంధించి ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కస్తూరి రంగన్ రూపొందించిన నివేదికను తిరస్కరించామని అటవీశాఖా మంత్రి ఈశ్వర్‌ఖండ్రె తెలిపారు. కొన్నేళ్ళకాలంగా కస్తూర్తిరంగన్ నివేదిక అమలు చేస్తే దశాబ్దాల కాలం కిందట నిర్మించుకున్న ఇళ్ళు, సాగు చేస్తున్న భూములను వదులుకోవాల్సి వస్తుందనే భయం ఆరేడు జిల్లాల ప్రజలను వెంటాడుతుండేది. ఎట్టకేలకు ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మంది రైతులు, గ్రామీణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. దక్షిణకన్నడ జిల్లా కుక్కె సుబ్రమణ్యా స్వామి ఆలయ సందర్శనకు వచ్చిన మంత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ కస్తూరిరంగన్ నివేదికను తిరస్కరించామన్నారు. శతాబ్దాల కాలంగా అటవీ ప్రాంతానికి అనుబంధంగా నివసిస్తున్న వారే అడవులను రక్షిస్తున్నారన్నారు. అటవీ రక్షణకు ఇప్పటికే శాఖ ద్వారా ప్రత్యేకమైన ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అడవుల రక్షణకు కట్టుబడ్డామన్నారు. పశ్చిమకనుమలకు అనుబంధంగా ఉండే జిల్లాల ప్రజలు, ప్రజాప్రతినిధుల డిమాండ్‌కు అనుగుణంగా కస్తూరిరంగన్ నివేదికను తిరస్కరించామన్నారు. కేంద్రప్రభుత్వానికి విషయాన్ని తెలిపామన్నారు. రాష్ట్రంలో 31 జిల్లాల జాయింట్ సర్వే చేసేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఆరునెలల వ్యవధిలో సర్వే జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సూచించామన్నారు. తద్వారా ప్రాథమికంగా అటవీ ప్రాంతాలకు అనుబంధంగా నివసించే ప్రజలు ఏవిధమైన సమస్యలు ఎదుర్కొంటున్నారనేది తెలుస్తుందన్నారు. సుబ్రమణ్యా సమీపంలోని కొల్లు మొగ్రు గ్రామం కడమకల్లు- కొడుగు పరిధిలోని గాళిబీడు రవాణాకు అభివృద్ధి చేయదలచామన్నారు. కుమార పర్వతారోహణ చేసే వారికి సౌకర్యాలు కల్పించే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. ఏనుగుల దాడులను నియంత్రించే చర్యలు చేపడతామని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. కర్ణాటకలో అటవీ ప్రాంతం నాశనమయ్యిందనే నివేదిక 2021-23 మార్చి దాకా ఉందన్నారు. అప్పట్లో తమ ప్రభుత్వం లేదన్నారు. ప్రస్తుతం తమ పాలన వచ్చాక అటవీ ప్రాంతంలో పచ్చదనం పెంచేందుకు తగిన చర్యలు తీసుకున్నామన్నారు. అడవుల సంరక్షణకు ప్రత్యేకమైన ప్రణాళికలు, పథకాలు సిద్ధం చేశామన్నారు. 2025 నాటికి రాష్ట్రంలో అటవీ ప్రాంతం పెరగనుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. బీదర్ ఎంపీ సాగర్‌ఖండ్రె, డీసీఎఫ్ ఆంటోని మరియప్ప, ఏసీఎఫ్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఎఫ్‌ఓలు విమల్‌బాబు, మంజునాథ్, సంధ్యాతో పాటు పలువురు అధికారులు మంత్రి వెంట ఉన్నారు.

గులాబ్‌జామ్.. రసగుల్లా..!

- ఆమె ఫోన్‌లో మాజీ మంత్రి, బీజేపీ నాయకుడి పేర్లు ఇవి..
- శ్వేతాగౌడ చీటింగ్ కేసులో ఆసక్తికర అంశాలు


విచారణకు వెళుతున్న మాజీ మంత్రి వర్తూరు

బెంగళూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వర్తూరు ప్రకాశ్ పేరుతో బంగారు ఆభరణాలు తీసుకుని నగదు చెల్లించకుండా మోసం చేసిన శ్వేతాగౌడ కేసు విచారణలో ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. కమర్షియల్ స్ట్రీట్ పోలీసుల నోటీసులకు అనుగుణంగా మాజీ మంత్రి వర్తూరు ప్రకాశ్ మంగళవారం విచారణకు హాజరయ్యారు. ఇదే సందర్భంలోనే సుదీర్ఘంగా పోలీసులు విచారణ సాగించారు. ఆరు నెలలక్రితం ఫేస్‌బుక్ ద్వారా శ్వేతాగౌడ పరిచయమని, ఆ తర్వాత సమాజ సేవ చేస్తున్నానంటూ మాట్లాడారన్నారు. ఒకటి రెండు సందర్భాల్లో భేటీ అయ్యామన్నారు. బహుమతి అంటూ బ్రాస్‌లెట్, ఉంగరం ఇచ్చారని పోలీసులకు వర్తూరు వివరించారు. వాటిని పోలీసులకు ఇచ్చారు. 12.50 లక్షల రూపాయల నగదు కూడా వాపసు చేశారు. తన పేరు చెప్పి ఏకంగా రూ.2కోట్ల విలువైన బంగారు ఆభరణాలు కొనుగోలు చేశారనే విషయం వ్యాపారి ఫోన్ చేసేవరకు తెలియదన్నారు. తనతోపాటు పలువురు రాజకీయ నాయకులతో ఫొటోలు తీసుకుని మోసం చేసినట్లు తెలుస్తోందన్నారు. కాగా శ్వేతాగౌడ ఫోన్‌లో వర్తూరు ప్రకాశ్ పేరును గులాబ్‌జామ్‌గాను, బీజేపీ నాయకుడు చలపతి పేరును మైసూరుపాక్‌గా, మరో వ్యక్తి పేరు రసగుల్లాగా నమోదు చేసినట్లు గుర్తించారు. వర్తూరు ప్రకాశ్ పలు బంగారు దుకాణాలకు శ్వేతాగౌడతో కలసి వెళ్లినట్లు తెలుస్తోంది. బంగారం వ్యాపారి సంజయ్‌బాప్నా మాట్లాడుతూ- తమ వద్ద ఆభరణాల కొనుగోలుకు వర్తూరు ప్రకాశ్, శ్వేతాగౌడ ఇద్దరూ వచ్చారని తొలిసారి డబ్బు చెల్లించారన్నారు. మేం వర్తూరు ప్రకాశ్ ఇంటికే ఆభరణాలు డెలివరీ చేశామని, ఆ తర్వాత శ్వేతాగౌడ రూ.2.9 కిలోల ఆభరణాలు తీసుకుని, నగదు ఇవ్వకుండా మోసం చేశారన్నారు.

ధర్మస్థళలో ప్రమాణానికి సిద్ధమా..?

- సీటీ రవికి మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ సవాల్





బెంగళూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పరిషత్‌లో తన పట్ల అనుచితమైన వ్యాఖ్యలు చేయలేదని వాదిస్తున్న ఎమ్మెల్సీ సీటీ రవికి మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ సవాల్ విసిరారు. ధర్మస్థళలో ప్రమాణం చేసేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. బెళగావిలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మహాభారతం, రామాయణ కాలం నుంచి మహిళను అవమానించేవారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. సీటీ రవి వ్యాఖ్యలకు సాక్ష్యాలు ఉన్నాయని లేదంటే అలాంటి మాటలు తనపై తానే చేసుకునేందుకు పిచ్చిదాన్నా అన్నారు. రాజకీయంగా తాను పొందేది ఏమైనా ఉందా..? అంటూ ప్రశ్నించారు. సీటీ రవి ఫ్రస్ట్రేషన్ పదం వాడానని చెబుతున్నారని, ఆ పదానికి ఎంత తేడా లేదా అన్నారు. లక్ష్మీ హెబ్బాళ్కర్‌ను చూసి రాజకీయాల్లోకి రావాలని మహిళలు అనుకోవాలన్నారు. కానీ ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు తానెందుకు పడాలన్నారు.

బీజేపీలో సమైక్యం

మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌ను ఉద్దేశించి ఎమ్మెల్సీ సీటీ రవి వ్యాఖ్యల దుమారంపై పోరాటానికి సిద్ధమైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రకు వ్యతిరేక కూటమి నేత బసనగౌడపాటిల్ యత్నాళ్ సుముఖత వ్యక్తం చేశారు. దీంతో బీజేపీలో ఈ వివాదంపై కలసి పోరాటం చేయనున్నారు. ఏ విధంగా నిరసన చేపట్టాలనే విషయమై రాష్ట్ర కోర్ కమిటీతో చర్చించాక విజయేంద్ర, పార్టీ జాతీయ నేతలను సంప్రదించేందుకు సిద్ధమవుతున్నారు.

రాజభవన్‌కు చేరిన వివాదం

విధానపరిషత్ సమావేశాల వేళ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్, బీజేపీ సభ్యుడు సీటీ రవిల మధ్య చోటు చేసుకున్న వివాదం రాజభవన్‌కు చేరింది. గవర్నర్ థావర్‌చంద్ గ్లెహాట్ ఆదేశాలకు అనుగుణంగా పరిషత్ సభాపతి బసవరాజహొరట్టి వివరణ ఇచ్చారు. తొలుత రాజభవన్ అధికారులు పరిషత్‌లో చోటు చేసుకున్న సంఘటన వివరాలను సభాపతిని కోరారు. ఆతర్వాత సభాపతి హొరట్టి నేరుగా ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఫోన్ చేసి రాజభవన్ నుంచి వివరణ కోరుతున్నట్లు తెలిపారు. అనంతరం సభాపతి నేరుగా రాజభవన్‌కు వివరణ ఇచ్చారు. బెళగావి సువర్ణసౌధలో ఈనెల 9 నుంచి 19వరకూ శాసనసభ శీతాకాల సమావేశాలు జరిగాయని చివరి రోజు గురువారం ప్రశ్నోత్తరాల వేళ చోటుచేసుకున్న గందరగోళంతో సభను కాసేపు వాయిదా వేశామని వివరిస్తూనే ఇప్పటికే తెలిపిన సమగ్ర సమాచారాన్ని రాజభవన్‌కు వివరించారు. ఇద్దరూ తనకు ఫిర్యాదు చేశారన్నారు. రికార్డుల పరంగా ఎక్కడా అటువంటి పదాలు లేవన్నారు. కానీ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ ఆడియోలు విడుదల చేసిన విషయాన్ని ప్రస్తావించినట్లు వివరించారు. ఆత్మసాక్షికి అనుగుణంగా వదిలిపెట్టి సభను వాయిదా వేశానని వివరణ ఇచ్చారు.

అంబారీ ఉత్సవ స్లీపర్ బస్సు సేవలు ప్రారంభం


అంబారీ ఉత్సవ స్లీపర్ బస్సు సేవలకు పచ్చజెండా చూపుతున్న మంత్రులు రామలింగారెడ్డి, దినేశ్ గుండూరావు

బెంగళూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేఎస్ఆర్టీసీకి చెందిన లగ్జరీ బస్సులు 'అంబారీ ఉత్సవ స్లీపర్ బస్సు' సేవలను మెజస్టిక్ బస్టాండ్‌లో మంగళవారం ప్రారంభించారు. రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు బస్సులకు పచ్చజెండా చూపారు. కేఎస్ఆర్టీసీ హుమ్నాబాద్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన డ్రైవింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన 1406 మంది అభ్యర్థులపైకి 50 మార్కులకు 50, 49, 48 మార్కులు సాధించిన 82మందికి డ్రైవర్ కమ్ కండక్టర్ పోస్టులను తాత్కాలికంగా నియమిస్తూ ఆదేశపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం రాష్ట్ర రోడ్డు రవాణా శాఖకు చెందిన సంస్థలకు 5,800 కొత్త బస్సులను చేర్చేందుకు అనుమతి ఇచ్చిందని, నాలుగు విభాగాలలో గత ఒకటిన్నర సంవత్సరంలో 4,301 బస్సులను చేర్చామన్నారు. కేఎస్ఆర్టీసీ, బీఎంటీసీ, ఈశాన్య, వాయువ్య విభాగాలలో 9వేల పోస్టులకు తమ ప్రభుత్వం అనుమతి ఇవ్వగా ఇప్పటివరకు 2144 డ్రైవర్ కమ్ కండక్టర్, సాంకేతిక, పాలనా సిబ్బంది నియామకాలకు ఆదేశించిందన్నారు. 6,856 పోస్టుల నియామకానికి సంబంధించి త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. శక్తి పథకం ద్వారా అన్ని వాహనాలలో ఇంత వరకు 356 కోట్లమంది మహిళలు ప్రయాణించారన్నారు. వారి ప్రయాణ చార్జీల టిక్కెట్ విలువ రూ.8,598.23కోట్లుగా ఉందన్నారు. కాగా ఏడాదిన్నర వ్యవధిలో 1004 మంది మృతి చెందిన సిబ్బంది కుటుంబీకులకు కారుణ్య నియామకాలు చేపట్టామ న్నారు. ప్రమాదాల్లో మృతి చెందిన 22మంది సిబ్బంది కుటుంబీకులకు తలా రూ.కోటి చొప్పున రూ.22కోట్లు పరిహారం ఇచ్చామన్నారు. గుండెపోటు, క్యాన్సర్, స్ట్రోక్, తదితర కారణాలతో మృతి చెందిన వారికి తలా రూ.10లక్షల చొప్పున 81మంది కుటుంబీకులకు రూ.8.10 కోట్లు పరిహారం ఇచ్చామన్నారు. కేఎస్ఆర్టీసీ సిబ్బంది పిల్లలకు విద్యా సహాయనిధి కింది ఇంతవరకు 6083 మందికి రూ.3.05 కోట్లు స్కాలర్‌షిప్ ఇచ్చామన్నారు. ఒకటిన్నర ఏడాదిలో రాష్ట్ర రోడ్డురవాణా సంస్థలకు 112 జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు దక్కాయన్నారు. అత్యాధునిక అంబారి ఉత్సవ స్లీపర్ సర్వీసులతో ప్రజలకు మెరుగైన ప్రయాణ అనుభూతిని కల్పించడమే ఉద్దేశమన్నారు.


అంబారీ ఉత్సవ స్లీపర్ బస్సులు

వక్క.. లాభాలు పక్కా..!


ఏపుగా పెరిగిన వక్క చెట్లు

కంప్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఈ ఏడు వక్క సాగులో లాభాలు ఆశాజనకంగా ఉన్నాయని, రైతులు ఆహార పంటలతో పాటు వాణిజ్య పంటలపై ఆసక్తి పెంచుకోవాలని వ్యవసాయ అధికారి ప్రసాద్ సూచించారు. మంగళవారం కంప్లి పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు అందజేశారు. కూడ్లిగి పరిధిలోని పలు గ్రామాల రైతులు బంజరు భూముల్లోను, బోర్ల కింద రైతులు వక్క పంట సాగు చేశారని, దిగుబడి ఆశాజనకంగా ఉందన్నారు. ఇతర పంటలు నష్టపోతుండంతో పలువురు రైతులు వక్కసాగుపై ఆసక్తి చూపుతున్నారన్నారు. గుడేకోట వద్ద ఇప్పటికే మొక్కలు కూడా దొరుకుతున్నాయన్నారు. రైతులు అధికారుల సూచనలతో పంటను ప్రారంభించాలన్నారు. ఖానాహోసళ్లి రైతు రాముడు మాట్లాడుతూ యేటా ఖరీఫ్, రబీలో వాతావరణ మార్పు, వర్షాప్రభావం వల్ల బోర్ల కింద వేసుకున్న వరిపంట బాగా నష్టపోతుందన్నారు. అప్పులు కట్టలేక ఇబ్బంది పడుతున్నామన్నారు. నాలుగేళ్ల కింద వక్క సాగు చేశాననీ, రెండు, మూడు సంవత్సరాలుగా మంచి దిగుబడి వస్తోందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడించవచ్చన్నారు. తక్కువ నీరున్న డ్రిప్ ద్వారా కూడా ఈ పంటను సాగు చేయవచ్చు, ఏ వాతావరణాన్ని అయినా తట్టుకునే శక్తి ఈ పంటకు ఉందన్నారు. హరప్పనహళ్లి, కూడ్లిగి ఈ ప్రాంతాల్లో ఇప్పటికే ఎక్కడ చూసినా వక్క పంటలే కనిపిస్తు న్నాయన్నారు.

ఏసు రాకకు వేళాయె..!

బెంగళూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు అంతా సిద్ధమయ్యింది. పండగ సందర్భంగా నగరంలోని ప్రధాన చర్చిలు విద్యుద్దీపాలంకరణతో ప్రత్యేక శోభ సంతరించుకున్నాయి. శివాజీనగర్ సెయింట్ బసిలికా చర్చ్‌లో మంగళవారం రాత్రి సాయంత్రం విశేష ప్రార్థనలు జరిగాయి. ఆర్చ్ బిషప్ పీటర్ మచాడో నేతృత్వంలో చర్చ్ ఫాదర్ బైబిల్ సందేశాలను వినిపించారు. క్రీస్తు బోధనలు, మేరీమాత ప్రత్యేకతను వివరించారు. భక్తులు కొవ్వొత్తులు వెలిగించారు. ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చ్‌స్ట్రీట్, కోరమంగల ప్రాంతాల్లో అర్ధరాత్రి దాకా ప్రార్థనలు కొనసాగించారు.





శివాజీనగర్ మేరీ బసిలికా చర్చి, శాంతాక్లాజ్ వద్ద చిన్నారి


చర్చిలో అలంకరణ


ప్రార్థనలో భక్తులు

రేణుకాస్వామి హత్య కేసులో మరో ఐదుగురికి బెయిల్

రేణుకాస్వామి హత్యకేసులో నిందితులందరికీ బెయిల్ వచ్చేసింది. సోమవారం విచారణ ఖైదీలుగా కొనసాగుతున్న మరో ఐదుగురికి బెయిల్ మంజూరయ్యింది. బెంగళూరు సెషన్స్ కోర్టు తీర్పుతో వీరికి విముక్తి లభించింది. దీంతో మొత్తం 17మందికి బెయిల్ వచ్చినట్లయ్యింది.

7

అక్షరాస్యత పెరిగినా సంస్కారం తగ్గింది

- పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ మంజునాథ్

ప్రస్తుత సమాజంలో సాంకేతికత, అక్షరాస్యత శాతం పెరిగినా మనుషుల్లో సంస్కారం తగ్గిందని బెంగళూరు గ్రామీణ ఎంపీ, పద్మశ్రీ డాక్టర్ మంజునాథ్ అభిప్రాయపడ్డారు.



కుంగిపోయిన బ్రిడ్జి

కుంగిన హగరి వంతెన

బొమ్మనహాళ్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కళ్లదేవనహళ్లి-బండూరు గ్రామాల మధ్య వేదవతి హగరి నదిపై వంతెన కుంగిపోయింది. భారీ వాహనాల రాకపోకలతో కూలేపోయే దశకు చేరుకుంది. వంతెనపై డివైడర్ మంగళవారం అకస్మాత్తుగా పక్కన కుంగి రెండుభాగాలుగా విడిపోయాయి. ఏ క్షణంలోనైనా ప్రమాదం జరగవచ్చని కళ్లదేవనహళ్లి, బండూరు, గోవిందవాడ, కళ్లహోళ తదితర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ బ్రిడ్జిని 40 ఏళ్ల క్రితం నిర్మించారని స్థానికులు అంటున్నారు. బొమ్మనహాళ్ మండలం నుంచి ఉరవకొండ, గుంతకల్లు ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ వంతెనే ఆధారం. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని వంతెనను నిర్మించేలా చూడాలని కోరుతున్నారు.



ఇటీవల పోలీసులు సీజ్‌చేసిన ఇసుక ట్రాక్టర్లు

సరిహద్దు దాటుతున్న ఇసుక

యాడికి మండలం మీదుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. చీకటి పడగానే గుట్టు చప్పుడు కాకుండా సరిహద్దులు దాటుతోంది. పెద్దపప్పూరు, తాడిపత్రి రూరల్ మండలాల నుంచి ఇసుకను రాత్రి 8 నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకూ అక్రమంగా తరలిస్తున్నారు. రాయలచెరువు, చందన, దైవాలమడుగు గ్రామాల మీదుగా నంద్యాల జిల్లాకు తరలిస్తున్నారని సమాచారం. పోలీసుల తనిఖీల సమయంలో.. కళ్లు కప్పేందుకు ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్లను పొలాలు, వంకల్లో ఆపుతున్నారు. పోలీసులు వెళ్లిపోయాక రవాణా చేస్తున్నారు. తనిఖీల్లో పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్ వద్ద పెడుతున్నారు. ఇసుక అక్రమ రవాణాదారులకు పోలీసు తనిఖీల సమాచారం ముందుగానే తెలుస్తోందని, అందుకే దొరక్కుండా తప్పించుకుంటున్నారని సమాచారం.

- ఆంధ్రజ్యోతి, యాడికి

న్యూస్‌బాక్స్

27న విచారణకు రండి

డీఎంహెచ్‌ఓకు పిలుపు

అనంతపురం టౌన్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈ.బీ. దేవిపై ఓ సబ్‌యూనిట్ అధికారి ఇచ్చిన ఫిర్యాదులపై విచారణకు జిల్లా అధికారులు సిద్ధమయ్యారు. డీఆర్‌ఓ మలోల విచారణ చేపడుతున్నారు. ఈనెల 27న హాజరు కావాలని డీఎంహెచ్‌ఓకు సమాచారం పంపారు.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవా రం 1650 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 9, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.28వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 28,310 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 12వేలు, సరాసరి రూ. 19వేలుతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 18 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఫైన్‌తో ఫీజు చెల్లించండి

అనంతపురం విద్య, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి-2025 పరీక్షలకు ఈ నెల 27వ తేదీ నుంచి రూ. 1000 ఫీజు చెల్లించవచ్చని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకూ ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకూ ఫీజు కట్టని విద్యార్థులు ఫీజు చెల్లించేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

'కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి'

ఉరవకొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కందుల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి డిమాండ్ చేశారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా కంది పంటను సాగు చేశారన్నారు. పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో రైతులు దళారులకు అమ్ముతున్నారన్నారు. ఇదే అదునుగా దళారులు తక్కువ రేటుకు కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

వెబ్‌సైట్‌లో పరీక్షల ఫైనల్ కీ

అనంతపురం విద్య, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతన పరీక్షల (ఎన్‌ఎంఎంఎస్) ఫైనల్ కీ డీజీఈ కార్యాలయ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. డీజీఈ కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో ఉంచారన్నారు. విద్యార్థులు పరిశీలించాలని సూచించారు.

27న విజయవాడలో రాష్ట్రస్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శాప్ ఆధ్వర్యంలో ఈనెల 27న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, మహిళలు వారి జనన, ఆధార్‌కార్డు, నివాసధృవీకరణ పత్రాలతో ఉదయం 7గంటలకు హాజరుకావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించే జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 9381747940ను సంప్రదించాలని కోరారు.

ఎల్‌ఎల్‌సీ ఈఈగా నారాయణనాయక్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీబీ డ్యాం పరిధిలోని ఎల్‌ఎల్‌సీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా నారాయణనాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర జలవనరులశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మైనర్ ఇరిగేషన్ ధర్మవరం డివిజన్ ఈఈగా పని చేస్తున్న నారాయణనాయక్‌ను టీబీ డ్యాం పరిధిలోని బళ్లారి సర్కిల్ ఎల్‌ఎల్‌సీ (లో లెవెల్ కెనాల్) ఈఈగా బదిలీ చేశారు. ఇక హెచ్చెల్సీలోని ధర్మవరం బ్రాంచ్ కెనాల్ ఈఈగా ఉన్న అబ్దుస్ సమీకి మైనర్ ఇరిగేషన్ ధర్మవరం డివిజన్ ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

పార్టీ విస్తరణకు కృషి చేయాలి



ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



హాజరైన నాయకులు, కార్యకర్తలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యలపై పోరాటాలు సాగిస్తూనే పార్టీ విస్తరణకు కృషి చేయాలని సీపీఎం నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. నగరంలోని ఎస్‌ఎస్ గ్రాండ్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నుంచి నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా 14వ మహాసభలు మంగళవారం సాయంత్రం ముగిసాయి. మహాసభల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుతోపాటు కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు పరిశీలకులుగా వ్యవహరించారు. రెండురోజుల పాటు పార్టీకి సంబంధించిన వివిధ అంశాలపై జరిగిన చర్చలను వారు పరిశీలించారు. గడిచిన మూడేళ్లలో పార్టీ చేపట్టిన కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించడంతోపాటు భవిష్యత్ కార్యాచరణను రూపొందించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో మతతత్వ ప్రమాదం మరింతగా ముంచుకొస్తోందన్నారు. బీజేపీ తెస్తున్న మత విభజన రాజకీయాలను తిప్పికొట్టి, ఐక్యతను తీసుకొచ్చే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో జరపాలన్నారు. అధికార టీడీపీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని విమర్శించారు. ప్రజలపై అధిక విద్యుత్ భారాలు మోపుతోందన్నారు. వీటిపై దృష్టి సారించి పోరాటాలు రూపొందించాల్సిన అవసరముందన్నారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గడిచిన మూడేళ్లలో సీపీఎం అనేక కార్యక్రమాలు రూపొందించిందన్నారు. అనంతరం 26 మందితో సీపీఎం జిల్లా నూతన కమిటీ, 9 మందితో కార్యదర్శివర్గం ఎన్నికను నిర్వహించారు. అనంతరం పామిడికి చెందిన అనిమిరెడ్డిని రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, గార్లదిన్నెకు చెందిన నాగమ్మను రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు సన్మానించారు.

సంక్షేమ పథకాల్లో కోత పెడితే సహించం

అనంతపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల్లో కోత పెడితే సహించేది లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనర్హుల గుర్తింపు పేరుతో జరుగుతున్న సర్వేను ఆయన తప్పుబట్టారు. అనంతపురం జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌ను మిగిల్చే క్రమంలో సర్వే పేరుతో అనర్హుల గుర్తింపు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. జాబితాను పార్టీలపరంగా గుర్తించి, రాజకీయ వేధింపులకు ఉపయోగించుకునే అవకాశాలు లేకపోలేదని అనుమానం వ్యక్త చేశారు. వైసీపీ ప్రభుత్వం ఇదే రకమైన చర్యలకు పాల్పడిందని అన్నారు. సర్వే పేరుతో కుటుంబ సమాచారాన్ని సేకరించి బయట కంపెనీలకు అప్పగించే ప్రమాదం ఉందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం తరహాలో సర్వే పేరుతో డేటా సేకరించి ప్రైవేట్ సంస్థలకు అప్పగించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అందుకే తాము డేటా ప్రైవసీ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అమెరికా, యూకే ఎన్నికల్లో కూడా ఈ రకమైన డేటా ప్రభావితం చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు డేటాను సంరక్షించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన వ్యవసాయరంగాన్ని ప్రైవేట్‌పరం చేయాలని చూస్తోందని ఆరోపించారు. రైతులు పోరాటం చేసి తిప్పికొట్టిన మూడు వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన అగ్రికల్చర్ మార్కెటింగ్ రిఫార్మ్స్ పేరుతో దేశంలో అమలు చేయాలని చూస్తోందని అన్నారు. చట్టంతో పనిలేకుండా, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదంతో దొడ్డిదారిన అమలు చేయించే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయని అన్నారు. ఏపీ ప్రభుత్వం దీన్ని వ్యతిరేకించాలని కోరారు. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ పట్ల కేంద్ర హోంమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందని అన్నారు. కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 30న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఎం నిర్ణయించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నడూ లేనివిధంగా ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.16 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందని అన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే ధ్వంసం చేయాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేశ్ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా యధావిధిగా అమలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాన్ని తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

చేపా.. చేపా!

ఎందుకు పెరగవ్?

నిర్వీర్యమవుతున్న పీఏబీఆర్ మత్స్యక్షేత్రం

109 చేపల పాండ్లలో...
వినియోగంలో ఉన్నది 37
తగ్గిపోతున్న చేపపిల్లల పెంపకం
పోస్టులన్నీ ఖాళీ.. భర్తీ చేసే నాథుడే లేడు
ఇదీ పీఏబీఆర్ మత్స్యక్షేత్రం దుస్థితి

> అనగనగా ఓ చేప. ఎన్నాళ్లున్నా అది ఒకటే ఉంటోంది. దాని సంతానం పెరగడంలేదు. ఎందుకిలా అని యోచించి దాని వద్దకెళ్లి ఎందుకు పెరగడం లేదని ప్రశ్నిస్తే దాని గోడంతా వెళ్లబోసుకుంది. దాని గోడంతా మీకోసం..

అనంతపురం ప్రెస్‌క్లబ్/కూడేరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్స్యసంపదను వృద్ధిచేసేందుకు ఏర్పాటుచేసిన మత్స్యక్షేత్రాల్లో పీఏబీఆర్ క్షేత్రమే పెద్దది. ఇక్కడ పక్కనే పెద్ద జలాశయముంది. ఎప్పటికీ నీరు సమృద్ధిగా ఉంటుంది. కావలసినంత స్థలం ఉంది. చేపల పెంపకానికి 109 చేపల పాండ్లున్నాయి. అయినా చేపల పెంపకం మాత్రం జరగడంలేదు. ఎక్కడా చూసినా ముళ్ల కంపలు... చెత్తాచెదారం, నెర్రెలు చీలిన పాండ్లు దర్శనమిస్తున్నాయి. సరైన పర్యవేక్షణ, మౌలిక వసతులు, మెయింటెనెన్స్ లేకపోవడంతో ఆ క్షేత్రం శిథిలావస్థకు చేరుకుంటోంది. పాండ్లన్నీ నిర్వీర్యమైపోవడంతో చేపపిల్లల పెంపకం ఏడాదికేడాది తగ్గుతూ వస్తోంది.



అతి తక్కువ చేపపిల్లల పెంపకం చేపడుతున్న పాండ్లు ఇవే

37 మాత్రమే వినియోగంలో..

ఈ క్షేత్రంలో దాదాపు నూట తొమ్మిది పాండ్లు ఉన్నాయి. అయితే వీటి ఆలనాపాలనా చూసుకునే వారు లేకపోవడంతో అవి ఒక్కొక్కటి శిథిలమవుతూ వస్తున్నాయి. ఇప్పటికే దాదాపు 72 పాండ్లు శిథిలమయ్యాయి. ప్రస్తుతం అక్కడ 37 పాండ్లు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. దీంతో కోట్లలో చేపల పిల్లల పెంపకం జరగాల్సిన ఈ క్షేత్రంలో 80 లక్షల చేపపిల్లలు మాత్రమే పెంపకం చేపడుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు అక్కడ కేవలం 10 లక్షల చేపపిల్లల పెంపకం మాత్రమే జరుగుతున్నట్లు తెలుస్తోంది.



పీఏబీఆర్ మత్స్యక్షేత్రం

ఏళ్లుగా సిబ్బంది కొరత...

పీఏబీఆర్ మత్స్యక్షేత్రంలో సరైన సిబ్బంది లేకపోవడంతో సమస్య తీవ్రతరమవుతోంది. ఇక్కడ ఎఫ్‌డీఓ అధికారితో పాటు ఒక ఫీల్డ్ మెన్, నలుగురు షిఫర్‌మ్యాన్‌లు, ఒక వాచ్‌మెన్ ఉండాలి. అయితే ఆయా పోస్టుల్లో ఉన్న సిబ్బంది పదవీ విరమణ చేయడంతో ఆ పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. అయితే ఆ ఖాళీలను భర్తీ చేయకపోవడంతో పర్యవేక్షణ సమస్య ఏర్పడుతోంది. ప్రస్తుతం ఇక్కడ రెగ్యులర్ ఎఫ్‌డీఓ లేకపోవడంతో ఇన్‌చార్జ్ ఎఫ్‌డీఓ ఉన్నారు. ఒక ఫీల్డ్ మెన్, ఒక షిషర్‌మ్యాన్ మాత్రమే ఉన్నారు. ఉండాల్సిన ఒక వాచ్‌మెన్ లేకపోవడంతో భద్రతా సమస్య తలెత్తుతోంది. ఆ క్షేత్రంలోకి ఎవరొస్తున్నారో... ఎవరు వెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. పలు సందర్భాల్లో భద్రత లేకపోవడంతో చేపపిల్లలు దొంగతనాలకు గురవుతున్నాయి.

నివేదిక పంపాం... త్వరలోనే పరిష్కారమవుతుంది

పీఏబీఆర్ మత్స్యక్షేత్రానికి సంబంధించి పాండ్ల సమస్య ఉంది. ఇందుకు సంబంధించిన నివేదికలు తయారు చేసి రాష్ట్ర అధికారులకు పంపాం. వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్‌లోపు ఈ సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి బడ్జెట్‌ను కేటాయిస్తే, పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

- శ్రీనివాస్, డీడీ, మత్స్యశాఖ

పంటలు కాపాడే ప్రయత్నం

కృష్ణ జింకల నియంత్రణకు చర్యలు
క్షేత్రస్థాయిలో పరిశీలించిన డీఎఫ్‌ఓ
రైతుల్లో చిగురిస్తున్న ఆశలు..



రైతులతో మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ (ఫైల్)

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో సాగు చేసిన పంటలను కృష్ణ జింకల నుంచి కాపాడుకోవడం రైతులకు సవాల్‌గా మారింది. రైతుల విన్నపం మేరకు అటవీ అధికారులు చర్యలు చేపట్టారు. వర్షాధారం మీద ఆధారపడి జిల్లాలోని వజ్రకరూర్, విడపనకల్ మండలాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తారు. అయితే వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంటలు ఆశించిన మేరకు చేతికి రావడం లేదు. అయినా స్థానిక రైతులు కనీసం 50 శాతమైనా చేతికందకుండా పోతుందా అనే ఆశతో వేల ఎకరాల్లో ప్రతి యేటా పంటలు సాగు చేస్తున్నారు. అయితే మొలక దశలోనే కృష్ణ జింకలు గుంపులుగా పొలాలపై దాడులు చేసి మొలక దశలోనే తినేస్తున్నాయి. వాటి పంటలను కాపాడుకోవడం రైతులకు సవాల్‌గా మారింది. దీంతో ఆయా మండలాలకు చెందిన పలువురు రైతులు ఈ నెల 9వ తేదీన జిల్లా కేంద్రానికి వచ్చి జిల్లా అధికారుల కు వినతి పత్రాలు సమర్పించారు. కృష్ణ జింకల నుంచి త మ పంటలను కాపాడాలని విన్నవించారు. అందులో భాగం గానే జిల్లా అటవీశాఖ కార్యాలయంలో జిల్లా అటవీశాఖా ధికారి విఘ్నేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. పదేళ్లుగా తమ గో డు చెప్పుకుంటున్నా, పరిష్కారం దొరకలేదని వాపోయారు. పదేళ్ల క్రితం వందల సంఖ్యలో ఉన్న కృష్ణ జింకలు క్రమేణా వేల సంఖ్యకు చేరాయి. వాటిని అదుపు చేసి, పంటలను కాపాడుకోవడం చాలా ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన డీఎఫ్‌ఓ మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. రైతులతో సమస్యపై ఆరా తీశారు. కృష్ణ జింకల దాడిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ముందుగా డ్రోన్ ద్వారా పరిశీలించి క్రిష్ణ జింకల సంఖ్యను అంచనా వేసేందుకు నిర్ణయించినట్లు డీఎఫ్‌ఓ పేర్కొన్నారు. అనంతరం ప్రారంభ చర్యల్లో భాగంగా ఉన్న వాటి సంఖ్య వృద్ధి చెందకుండా తగిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. త మ విన్నపాన్ని మన్నించి డీఎఫ్‌ఓ క్షేత్రస్థాయి పర్యట నకు వెళ్లడంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నా రు.

క్షేత్రస్థాయి తనిఖీతో అవగాహన వచ్చింది



స్థానిక రైతులు కార్యాలయానికి వచ్చి వారి సమస్యను విన్నవించారు. దీంతో సమస్య ఎంత ఇబ్బందికరంగా ఉందో అర్థమైంది. సమస్య తీవ్రతను గమనించి వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాం. అక్కడ సమస్య చాలా ఇబ్బందికరంగా ఉంది. ఇప్పటికిప్పుడు పరిష్కరించలేమ ని అర్థమైంది. అయితే అవి మరింత వృద్ధి చెందకుండా , మరో సమస్య తలెత్తకుండా వెంటనే చర్యలు చేపట్టేలా ప్రణాళిక తయారుచేస్తున్నాం. వీలైనంత త్వరగా రైతుల కు న్యాయం జరిగేలా చూస్తాం.

- విఘ్నేష్, జిల్లా అటవీశాఖ అధికారి



కేక్ కట్ చేస్తున్న ఎంపీ అంబికా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఇతర నాయకులు

టీడీపీ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

అనంతపురం అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, మీడియా కో ఆర్డినేటర్ కూచి హరి, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న తదితరులు కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. జిల్లాలోని క్రిస్టియన్లకు ఎంపీ అంబికా, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు లింగారెడ్డి, మణికంఠబాబు, కురబ నారాయణ స్వామి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం

ఇన్‌చార్జి కలెక్టరు శివనారాయణశర్మ



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న శివనారాయణశర్మ

అనంతపురం టౌన్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల చట్టంపై అందరికీ అవగాహన అవసరమని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఇన్‌చార్జి కలెక్టర్ సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సంక్షేమం, హక్కులపై అవగాహన కల్పించడం కోసమే జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ చట్టం ద్వారా మోసపోయిన వినియోగదారులకు సత్వర న్యాయం సాధ్యమన్నారు. అనంతరం వినియోగదారుల చట్టంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను ఇన్‌చార్జి కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, జిల్లా కన్స్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్ శ్రీలత, లీగల్‌మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్, డీఈఓ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చేతులెత్తేసిన ఆంధ్ర బ్యాటర్లు

ఆరు వికెట్లు తీసిన మహారాష్ట్ర బౌలర్ సుభం



సుభంకాదం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ కూచ్‌బెహార్ అండర్-19 టోర్నీలో ఆంధ్ర బ్యాటర్లు చేతులెత్తేశారు. మహారాష్ట్ర బౌలర్ సుభంకాదం ఆరు వికెట్లు తీయడంతో ఆంధ్రజట్టు 143 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఆంధ్ర, మహారాష్ట్ర జట్ల మధ్య క్వార్టర్ ఫైనల్ ఆర్డీటీ స్టేడియంలో మంగళవారం మూడవ రోజు కొనసాగింది. ఓవర్‌నైట్ స్కోర్ 3 వికెట్లు కోల్పోయి 69 పరుగులతో మూడో రోజు ఆంధ్ర జట్టు ఆటను ప్రారంభించింది. సుభంకాదం ధాటికి 143పరుగులకే ఆలౌట్ అయ్యింది. బ్యాటర్లు వరుణ్ సాత్విక్ 50, లోహిత్ లక్ష్మీనారాయణ 28 పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన మహారాష్ట్ర జట్టు ఆటముగిసే సమయానికి 58 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసింది. ప్రస్తుతానికి మహారాష్ట్ర 450 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. సుస్రుత్ సావంత్ 56పరుగులు చేసి నాటౌట్‌గా నిలిశాడు. ఆంధ్ర బౌలర్లలో యువన్ 2, రాజేష్ వికెట్ తీశారు. ఒక్కరోజు ఆటమాత్రమే మిగిలి వుండటంతో మ్యాచ్ డ్రాగా ముగిసే అవకాశం కనిపిస్తోంది. బీసీసీఐ సెలెక్టర్ హర్విందర్‌సింగ్ సోధి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఏజీఎం శివకుమార్, మహారాష్ట్ర సెలెక్షన్ కమిటీ చైర్మన్ మిలింద్‌గుంజాల్, క్రికెట్ సంఘం జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి తదితరులు పోటీలను పర్యవేక్షించారు.


జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పద్యపోటీలను జయప్రదం చేయాలని ఆ ఫౌండేషన్ కార్యదర్శి అప్పిరెడ్డి హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలోని వేమన ఫౌండేషన్ కార్యాలయంలో పద్యపోటీల పోస్టర్లను ఎస్కేయూ విశ్రాంత వీసీ కాడా రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి హరినాథరెడ్డి మాట్లాడుతూ 100 పాఠశాలల్లో పద్యపోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆసక్తి ఉన్న పాఠశాలల యాజమాన్యాలు ఈ నెలాఖరులోపు 9963917187 నెంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జనవరి 9వ తేదీలోపు పాఠశాలస్థాయిలో పద్యపోటీలు నిర్వహించి, విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలు, వేమన పుస్తకాలను బహుమతులుగా అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేమన ఫౌండేషన్ సభ్యులు మనోహర్‌రెడ్డి, లోకన్న, జలీల్ అహ్మద్, వన్నూర్ సాబ్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కౌంప్...

ఏసుక్రీస్తు



ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజలు ఆచరించే మతపరమైన సాంస్కృతిక పండుగ క్రిస్మస్‌ను డిసెంబరు 25న ఆచరిస్తారు. ఆయుధాలతోనో, ధనంతోనో కాకుండా తన సువార్తతో ప్రపంచాన్ని ఏసుక్రీస్తు జయించాడు. సుఖాలనూ, సంపదలనూ కోరుకోలేదు. పాపవిముక్తులను చేయడానికి శిలువనెక్కి తన రక్తాన్ని చిందించారు. తనపై తండ్రి ఉంచిన బాధ్యతను నెరవేర్చడమే ధ్యేయంగా ముందుకు సాగిన క్రమంలో దీనులను ఆదుకుని, ఎందరికో స్వస్థత కలిగించారు. ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలని గట్టిగా సంకల్పం చేసుకొనే సందర్భమే క్రిస్మస్.

మదన్ మోహన్ మాలవ్య (జయంతి)



'సత్యమేవ జయతే' నినాదంతో పేరొందిన పండిట్ మదన్ మోహన్ మాలవ్యా (మాలవీయ) అలహాబాద్‌లో 1861 డిసెంబరు 25న జన్మించారు. కాంగ్రెస్ పార్టీకి నాలుగుసార్లు అధ్యక్షుడిగా సేవలందించారు. అఖిల భారతీయ హిందూ మహాసభను స్థాపించి హిందూధర్మ సంరక్షణ కోసం పాటుపడ్డారు. వారణాసిలో బెనారస్ హిందూ విశ్వ విద్యాలయ సహ సంస్థాపకుల్లో ఒకరు. 1946 నవంబరు 12న కన్నుమూశారు. మరణానంతరం 2014లో 'భారత రత్న' ప్రకటించారు.

ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ (జయంతి)



ప్రముఖ కవయిత్రి, పరిశోధకురాలు ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ 1917 డిసెంబరు 25న ఏలూరులో జన్మించారు. స్త్రీవాదంతో కూడిన పూర్తిగా స్త్రీలే రాసిన కథలతో కూడిన తొలి కథాసంకలనం 'కథా మందారం' 1968లో సంచలనం సృష్టించింది. యల్లాప్రగడ జగన్నాధము ఈమెకు ఆధ్యాత్మిక గురువు. పన్నెండో యేటనే స్వాతంత్రోద్యమంలో పాల్గొని ఉత్తేజపూరితమైన దేశభక్తి గీతాలను ఆమె పాడారు. 18వ యేట ఉభయభాషా ప్రవీణ పట్టా, ఇంకా 12 బిరుదులు, 20 ఘన సత్కారాలు పొందారు. 1996లో కన్నుమూశారు.

నౌషాద్ (జయంతి)



ప్రపంచవ్యాప్తంగా పేరొందిన అతికొద్ది భారతీయ సంగీత దర్శకుల్లో ఒకరైన నౌషాద్ అలి 1919 డిసెంబరు 25న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖ్‌నవ్‌లో జన్మించారు. ఆయన సమర్పించిన శాస్త్రీయ సంగీత పాటలు సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. ఆయన ఏకంగా 35 సిల్వర్‌జూబ్లీ హిట్స్, 12 గోల్డెన్ జూబ్లీ హిట్స్, 3 డైమండ్ జూబ్లీ హిట్స్ అందించారు. 1957లో ఆయన సంగీతం అందించిన 'మదర్ ఇండియా' చిత్రం ఆస్కార్ అవార్డుకు నామినేట్ అయ్యింది. దాదాసాహెబ్ ఫాల్కే, పద్మభూషణ్ పురస్కారం ఇతర అవార్డులు అందుకున్నారు. 2006 మే 5న కన్నుమూశారు.

అటల్ బిహారీ వాజ్‌పేయి (జయంతి)



'అజాత శత్రువు'గా విలక్షణ రాజకీయ నేతల్లో ఒకరుగా పేరొందిన అటల్ బిహారీ వాజ్‌పేయి 1924 డిసెంబరు 25న మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో జన్మించారు. సాహితీ పిపాస మెండుగా కల్గిన వాజ్‌పేయి మూడుసార్లు ప్రధానిగా సేవలందించిన తొలి కాంగ్రెస్సేతర నేత కావడం విశేషం. ఆయన జయంతిని సుపరిపాలనా దినోత్సవంగా ఆచరిస్తున్నారు. 'భారతరత్న', 'పద్మ విభూషణ్' వంటి ఉన్నత పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నిలిచిన వాజ్‌పేయి 2018 ఆగస్టు 16న కన్నుమూశారు.

సూలగిత్తి నరసమ్మ (వర్ధంతి)



కన్నడనాట మహిళలకు ఉచితంగా పురుడు పోయించిన 'పద్మశ్రీ' గ్రహీత సూలగిత్తి నరసమ్మ గురించిన తెలియని కన్నడిగులు ఉండరంటే అతిశయోక్తి లేదనిపిస్తుంది. 1920లో తుమకూరు జిల్లా పావగడ ప్రాంతంలో జన్మించారు. వైద్యసదుపాయాలు అంతంతమాత్రంగా ఉన్న రోజుల్లో సంప్రదాయ పద్ధతిలో 15వేల మందికిపైగా కాన్పులు జరిపారు. కర్ణాటక ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'రాజ్యోత్సవ పురస్కారం'తో గౌరవించింది. లెక్కకు మిక్కిలి పురస్కారాలు, సన్మానాలు అందుకున్న నరసమ్మ 2018 డిసెంబరు 25న కన్నుమూశారు.

పండిట్ రామ్‌నారాయణ్ (జయంతి)



అంతర్జాతీయ స్థాయిలో సారంగి వాద్యపరికరంతో పేరొందిన ప్రముఖ హిందుస్థానీ సంగీత కళాకారుడు 'పద్మ విభూషణ్' గ్రహీత పండిట్ రామ్ నారాయణ్ 1927 డిసెంబరు 25న ఉదయ్‌పూర్‌లో జన్మించారు. అమెరికన్ సొసైటీ ఫర్ ఈస్టర్న్ ఆర్ట్స్‌లో సంగీత బోధన చేస్తున్నారు. 1980 వరకు ఆయన దేశ విదేశాల విద్యార్థులకు హిందుస్థానీ సంగీతంలో మెళుకువలు నేర్పారు. 2007లో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో రామ్‌నారాయణ్ బయోగ్రఫీపై ప్రత్యేక డాక్యుమెంటరీని ప్రదర్శించారు. 2024 నవంబరు 9న కన్నుమూశారు.

బుద్ధా అరుణారెడ్డి (పుట్టినరోజు)



జిమ్నాస్టిక్స్‌లో పేరొందిన బుద్ధా అరుణారెడ్డి 1995 డిసెంబరు 25న హైదరాబాద్‌లో జన్మించారు. 2007లో జాతీయక్రీడల్లో వాల్ట్ విభాగంలో పతకం సాధించారు. కరాటేలో సాధించారు. 2013, 2014, 2017 ప్రపంచ జిమ్నాస్టిక్ పోటీల్లో పాల్గొని ఓటమి చెందినా నిరాశచెందక 2018లో కాంస్య పత కం సాధించి దేశకీర్తిని ఇనుమడింపచేశారు. ఈజిప్షియన్ చారోస్‌కప్ 2021 టేబుల్ వాల్ట్, ఫ్లోర్ ఈవెంట్స్‌లో రెండు గోల్డ్‌మెడల్ సాధించారు. కాగా కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించిన అనంతరం జిమ్నాస్టిక్స్‌లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించారు. గోస్పోర్ట్స్ ఫౌండేషన్ ద్వారా రాణించారు.

గణితరంగానికి రామానుజన్ సేవలు అపారం

» ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ ఆర్ విఠల్‌రావ్

బెంగళూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గణితరంగానికి శ్రీనివాస రామానుజన్ సేవలు అపారమని ఆయన కృషి అనన్యమని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ గణిత విభాగం ప్రొఫెసర్ ఆర్ విఠల్‌రావ్ అభిప్రాయపడ్డారు. నేషనల్ కళాశాలకు అనుబంధమైన ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. 1987లో రామానుజన్ శతాబ్ది ఉత్సవాలు తర్వాత ఎక్కువమంది ప్రజలు ఆయన సేవలను అర్థం చేసుకున్నారన్నారు. 2012లో ప్రధాని మన్మోహన్ సింగ్ పాలనలో ఏటా రామానుజన్ జయంతిని గణిత దినోత్సవంగా నిర్వహించే పరంపర ప్రారంభించారన్నారు. భారతీయ విద్యాభవన్, గాంధీ విజ్ఞాన మానవ వనరుల కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎస్ బాలచంద్రరావ్‌తోపాటు విద్యాసంస్థ చైర్మన్ సుబ్రమణ్యం, కార్యదర్శి వెంకటశివారెడ్డి తదితరులు ప్రసంగించారు. కువెంపు యూనివర్సిటీ ప్రొఫెసర్ బిజే గిరీశాతోపాటు పలువురు పాల్గొన్నారు.



జాతీయ గణిత దినోత్సవం ప్రారంభంలో ప్రొఫెసర్ విఠల్‌రావ్ తదితరులు

సాంకేతికంగా ఎదిగినా సంస్కృతి మూలాలు ప్రధానం



విద్యార్థులతో రచయిత చేతన్ భగత్

బెంగళూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సాంకేతికంగా ఎంత ప్రగతి సాధించినా సంస్కృతి మూలాల్లో మార్పు ఉండదని రెండింటికీ అనుబంధంగా నైపుణ్యత సాధిస్తేనే విజయం సాధ్యమని ప్రముఖ రచయిత చేతన్ భగత్ అభిప్రాయపడ్డారు. కెరీర్ ఉత్సవ్‌లో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాటా్డారు. శారీరక ధృడత్వం, భావనాత్మకమైన మేథస్సు, వ్యక్తిగతమైన ఉదారత, ఆర్థిక సమతుల్యం వంటి 11 కీలకమైన అంశాలను వ్యక్తిత్వంలో అలవరుచుకుంటేనే వృత్తి జీవనంలో ఉత్తమ సాధన సాధ్యమన్నారు. ప్రస్తుత సోషల్‌మీడియాలో లైక్, కామెంట్ తరహాలో ప్రజాభిమానం పొందడం పెరుగుతోందని ఇది సమగ్రతకు నిలువుటద్దం కాదన్నారు. కెరీర్ ఉత్సవ్ ఫౌండర్ సీఈఓ శ్రీపాల్‌జైన్ మాట్లాడుతూ విద్యార్థులకు వృత్తిపర ఉద్యోగాలకు సమగ్రమైన సమాచారం అందించడమే లక్ష్యమన్నారు. 11వ విడత కెరీర్ ఉత్సవ్ నిర్వహించినట్లు తెలిపారు.

రామయ్య విద్యార్థుల రక్తదానం

బెంగళూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రామయ్య ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్, రోటరీ సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో 1007 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. శిబిరాన్ని ఈశాన్య విభాగం డీసీపీ సజీత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సజీత్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజికసేవలో భాగస్వాములు కావాలన్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వంటి విభాగాలలో చేరడం ద్వారా సమాజం గురించి తెలుసుకోవడంతోపాటు మనం జీవిస్తున్న పరిసరాలలో ఏ విధమైన అవసరాలు ప్రజలకు కీలకమో తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. నేను మూడేళ్లపాటు ఎన్ఎస్ఎస్‌లో పనిచేశానని గుర్తు చేసుకున్నారు. ఇంజనీరింగ్ చేసినవారు పాలన, సమాజసేవ, రాజకీయాలు, పరిశోధక రంగంలో ఉన్నారన్నారు. గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎంఆర్ సీతారాం మాట్లాడుతూ ఎంఎస్ రామయ్య దూరదృష్టితో భవిష్యత్తు సమాజానికి ఉన్నతమైన విద్య కీలకమని భావించి సంస్థలను ఆరంభించారన్నారు. రెండు దశాబ్దాలలో సమాజంలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. సేవా మనోభావాలు క్షీణిస్తున్నాయని యువత స్వార్థాన్ని వీడి సమాజం కోసం పాటుపడాలన్నారు. సంస్థ సీఈఓ హెచ్‌వీ పార్శ్వనాథ్, జీ రామచంద్ర, ప్రిన్సిపాల్ ఎన్‌వీ ఆర్ నాయుడు, ఎన్ఎస్ఎస్ విభాగం పుట్టబోరేగౌడ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో డీసీపీ సజీత్, డాక్టర్ ఎంఆర్ సీతారాం తదితరులు

అక్షరాస్యత పెరిగినా.. సంస్కారం తగ్గింది...

» డాక్టర్ మంజునాథ్

విజయపుర, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యానికి పూర్వంతో పోలిస్తే ప్రస్తుతం అక్షరాస్యత శాతం పెరిగినా సంస్కారం తగ్గిందని బెంగళూరు గ్రామీణ ఎంపీ, పద్మశ్రీ డాక్టర్ మంజు నాథ్ అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని నందిని విద్యానికేతన్ పాఠశాలలో ఏర్పాటైన నందిని తరంగ 2024 వార్షికోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. పిల్లల్లో విద్య తగ్గినా సంస్కారం మాత్రం కోల్పోరాదన్నారు. విద్య, సంస్కారం అనేవి జీవితానికి పునాదుల వంటివన్నారు. ముందజంలో ఉన్న జపాన్, ఫ్రాన్స్, ఇటలీ, చైనాలలో ఆంగ్లభాష లేదని, అక్కడివారు తమ మాతృభాషకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఎంత ఉన్నత హోదాలకు చేరినా వారు తమ దేశభాషలనే ప్రధానంగా భావించా రన్నా రు. అయితే మన దేశంలో మాత్రం ఆంగ్ల వ్యామోహంలో తమ మాతృభాషను నిర్లక్ష్యం చేస్తుండడంపై విచారం వ్యక్తం చేశారు. యువతలో ఈ ధోరణి మారాలన్నారు. మీరు ఎన్ని భాషలు నేర్చుకున్నప్పటికీ తొలుత కన్నడ ఆరాధనగా ఉండాలన్నారు. పులకేశినగర్ ఎమ్మెల్యే ఏసీ శ్రీనివాస్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పిల్లలకు మనం ఇచ్చే విద్యయే గొప్ప ఆస్తి అన్నారు. దురలవాట్లకు లోను కారాదని హితవు పలికారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. విద్యాసంస్థ అధ్యక్షుడు చేతన్‌గౌడ, కార్యదర్శి చైత్ర, డైరెక్టర్ సుశీల్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ మంజునాథ్‌కు సన్మానం

తాలూకాలో 139మందికి చేయూత



శిడ్లఘట్ట తాలూకాలో నిత్యావసరాలు అందజేత


శిడ్లఘట్ట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్టలో తాలూకాలో మొత్తం 139మంది ప్రతి నెలా రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నామని ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంస్థ తాలూకా యోజనాధికారి సురేశ్‌గౌడ తెలిపారు. ఇదే సందర్భంగా వాత్సల్య కార్యక్రమంలో భాగంగా నిత్యావసరాలు, వంట సామగ్రి సమకూరుస్తున్నామన్నారు. నగరసభ సభ్యుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ ధర్మస్థళ సంస్థ సేవలతో నిరుపేదలకు ఎంతో అనుకూలంగా ఉందన్నారు. సంస్థకు చెందిన మంజునాథ్, జ్ఞానవికాస సమన్వయాధికారి అరుణా, సంఘసంస్థలు తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో...

బాగేపల్లి: ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలకోసం ఉద్దేశించిన వాత్సల్య కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. సంస్థ తాలూ కా యోజనాధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లా డుతూ బాగేపల్లి హోబళి పరిధిలోని ఘంటంవారిపల్లి గ్రామపంచాయతీ నల్లప్పరెడ్డిపల్లికి చెందిన ఒబ్బణ్ణకు కిట్‌ను అందచేశారు. తాలూకాలోని వందలాదిమంది అనాథ, నిరుపేద కుటుంబాలను ఆదుకునేలా నిత్యావసరాల వస్తువులను కిట్ రూపంలో అందచేస్తోందన్నారు. ఈ సందర్భంగా సంస్థకు చెందిన మమతా తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణ చెప్పి.. పదవి నుంచి వైదొలగాలి: ఎంపీ

రాయచూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ వేదికగా భారత రాజ్యాంగాన్ని అవమానించడంతో పాటు భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పి పదవి నుంచి తప్పుకోవాలని రాయచూరు ఎంపీ జీ కుమార్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలో విలేఖరులతో మాట్లాడినప ఎంపీ, లోకసభలో హోం మంత్రి చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికి అవమానకరమేనన్నారు. హోం మంత్రి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల చేసిన వ్యాఖ్యలను బీజేపీ నాయకత్వం ఖండించకపోగా ఆయన వ్యాఖ్యలను సమర్థించాలనుకోవడం దౌర్భాగ్యమన్నారు. బీజేపీకి కేంద్ర ప్రభుత్వానికి భారత రాజ్యాంగం పట్ల దళితుల పట్ల ఉన్న వ్యతిరేక భావాన్ని హోం మంత్రి వ్యాఖ్యలు మరో సారి స్పష్టం చేశాయన్నారు. అదే రీతిలో రాజ్యాంగం పై చర్చకోసం పట్టుబట్టిన లోకసభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, రాజ్యాసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గెల పట్ల బీజేపీ సభ్యులు పార్లిమెంట్ వేదికగా అనుచితంగా ప్రవర్తించారని ఈ సందర్భంగా లోకసభ సభ్యుడు కుమార్ నాయక్ తెలిపారు. పైగా తమకే అవమానం జరిగినట్లు బీజేపీ నాయకులు ప్రతివిమర్శలు చేయడం విడ్డూరమన్నారు. ఇలాంటి ధోరణిని ప్రజలు గమనిస్తున్నారని వీరికి తగిన సమయంలో గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు. ఇకపై తీరు మార్చుకోకపోతే గుణపాఠాలు తప్పవన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కుమార్ నాయక్

హోంగార్డుల సేవలు అభినందనీయం

● ఏడీసీ శివానంద భజంత్రి

రాయచూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖకు అనుబంధంగా పని చేస్తున్న హోంగార్డుల సేవలు ప్రశంసనీయం, అభినందనీయమని ఏడీసీ శివానంద భజంత్రి అన్నారు. హోంగార్డ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని కన్నడ భవన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఏడీసీ మాట్లాడారు. హోంగార్డ్స్ పోలీస్ విభాగంలో అత్యంత కీలకమైన సేవలందిస్తున్నారని, అత్యవసర వేళల్లో ప్రాణాలకు తెగించి పని చేస్తున్నారన్నారు. అదే సమయంలో పోలీసు హోంగార్డ్స్ రెండు కూడా అవిభాజ్యమైన శాఖలని ఇద్దరి సమన్వయంతో చేస్తున్న సేవలు సమాజానికి ఎంతో ఉపయోగకరమన్నారు. వరదలు, ప్రకృతి వైపరీత్యాలు, ఎన్నికలు ఇతరత్ర ప్రత్యేక సందర్భాల్లో హోంగార్డ్స్ నిర్వర్తిస్తున్న సేవలు అత్యంత కీలకమని వారికి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసులతో సమానంగా వారికి అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని, వారికి మరిన్ని ఉద్యోగ సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ప్రజల భద్రతకు పాటుపడతామని హోంగార్డులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డులు, అధికారులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏడీసీ శివానంద భజంత్రి ఇతర పోలీసు అధికారులు

జల్లికట్టు పోటీలకు మార్గదర్శకాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జల్లికట్టు పోటీల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మార్గదర్శకాలను విడుదల చేసింది. రాష్ట్రంలో జనవరి 14వ తేది పొంగల్ వేడుకల్లో భాగంగా జల్లికట్టు పోటీలు నిర్వహిస్తుంటారు. మదురై అవనియాపురం, పాలమేడు, అలంగానల్లూర్ తదితర ప్రాంతాల్లో జరిగే జల్లికట్టు పోటీలు చూసేందుకు దేశ, విదేశాల నుంచి ప్రజలు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో, పశుసంవర్ధక శాఖ ప్రధాన కార్యదర్శి సత్యప్రద సాహు కలెక్టర్లకు పంపిన లేఖలో మార్గదర్శకాలను సూచించారు.

- జిల్లా కలెక్టర్ నుంచి ప్రాంతం, సమయం తీసుకోకుండా జల్లికట్టు పోటీలు నిర్వహించరాదు.
- జల్లికట్టు పోటీల నిర్వహణకు తగిన భద్రత కల్పించాలి.
- జల్లికట్టు పోటీల్లో పాల్గొనే ఎద్దులను హింసించరాదు.
- జల్లికట్టు పోటీలకు ముందు ఎద్దులకు పశు వైద్యుల సర్టిఫికెట్ పొందాలి.
- కొత్తగా రూపొందించిన www.jallikattu.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో మాత్రమే జల్లికట్టు పోటీలకు దరఖాస్తు చేసుకోవాలి.
- జల్లికట్టు పోటీలను పూర్తిగా వీడియో రికార్డింగ్ చేయాలి.

31న తిరువళ్లువర్ విగ్రహ సిల్వర్ జూబ్లీ వేడుకలు

ప్యారీస్, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి చెందిన కన్నియాకుమారిలో తిరువళ్లువర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి 25ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 31, జనవరి 1వ తేదీల్లో పర్యాటక శాఖా ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా పది బస్సులకు తిరువళ్లువర్ పెయింటింగ్ చేశారు. ఈ బస్సులను మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపముఖ్యమంత్రి ఉదయనిధి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు స్వామినాదన్, పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ఏస్టర్ గార్డియన్స్ గ్లోబల్ నర్సింగ్ అవార్డుకు నామినేషన్లు

బెంగళూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏస్టర్ డిఎం హెల్త్ కేర్ ద్వారా ఏస్టర్ గార్డియన్స్ గ్లోబల్ నర్సింగ్ అవార్డు నాల్గో ఎడిషన్ నామినేషన్లు ప్రారంభించినట్టు ఫౌండర్ చైర్మన్ డాక్టర్ ఆజాద్ మూపెన్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా ఉత్తమ సేవలందించే నర్సులకు ప్రతిష్టాత్మకమైన పురస్కారం అందిస్తామన్నారు. బెంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా హెల్త్‌కేర్ రంగంలో విశిష్ట సేవలందించేవారికి ఉత్తమమైన గౌరవం అందించదలిచామన్నారు. ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ నర్సింగ్ అవార్డుతోపాటు 2 కోట్ల రూపాయలు ప్రదానం చేస్తామన్నారు. ఇటీవలే మూడో ఎడిషన్ విజేతగా విక్టోరియా జువాన్‌కు దక్కిందన్నారు. 200కుపైగా దేశాల నుంచి 78వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. నాల్గో ఎడిషన్‌కు సంబంధించి కూడా ప్రపంచవ్యాప్తంగా ఉత్తమ సేవలందించేవారికి గుర్తించదలిచామన్నారు.

శ్రీరామమందిరంలో క్షీరాభిషేకం

చింతామణి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్ఆర్ లే అవుట్‌లోగల బ్రహ్మచైతన్య శ్రీరామమందిరంలో బ్రహ్మచైతన్య మహరాజ్ 111వ ఆరాధనా మహోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పలు ధార్మిక కార్యక్రమాలు సాగాయి. ధ్యానమందిరంలోని భక్తవత్సలుడు శ్రీరాముడు, భక్తాగ్రేసరుడు ఆంజనేయస్వామికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం, మహన్యాస పూర్వక శతరుద్రాభిషేకం, అష్టావధానసేవ, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. విద్వాన్ ఫణిరాజ్ నేతృత్వంలో దివ్యనామ సంకీర్తన, భక్తబృందంచే భజనలు, నృత్య జాగరణ సాగింది.



క్షీరాభిషేకంలో పాల్గొన్న భక్తులు

రేణుకాస్వామి హత్య కేసులో మరో ఐదుగురికి బెయిల్

» బయటకు వచ్చిన 17 మంది నిందితులు

బెంగళూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్యకేసులో విచారణ ఖైదీలుగా కొనసాగుతున్న మరో ఐదుగురికి బెయిల్ మంజూరైంది. బెంగళూరు సెషన్స్ కోర్టు సోమవారం తీర్పును ప్రకటించింది. దీంతో హత్యకేసును ఎదుర్కొంటున్న మొత్తం 17మంది బెయిల్‌పై బయటకు వచ్చినట్లయ్యింది. వీరిలో రాజరాజేశ్వరినగర్‌లోని స్టోని బ్రూక్ రెస్టారెంట్ యజమాని వినయ్, పవిత్రగౌడ అసిస్టెంట్ పవన్, చిత్రదుర్గకు చెందిన దర్శన్ అభిమానసంఘం అధ్యక్షుడు రాఘవేంద్ర, వినయ్, నందీశ్‌లకు బెయిల్ మంజూరైంది. పవిత్రగౌడ ఇంట్లో పనిచేసే పవన్ వాట్సప్ మెసేజ్‌లు చేసిన రేణుకాస్వామిని గుర్తించడంలో కీలక భూమికగా వ్యవహరించగా చిత్రదుర్గ నుంచి బెంగళూరుకు తీసుకురావడంలో దర్శన్ అభిమానసంఘం అధ్యక్షుడు రాఘవేంద్ర వ్యవహరించారు. హత్య జరిగిన రోజు దర్శన్‌తోపాటు పలువురు స్టోని బ్రూక్ రెస్టారెంట్‌లో గడిపిన విషయం తెలిసిందే. ఇలా కేసుతో సంబంధం ఉన్న మేరకు సుదీర్ఘకాలంపాటు జైలులో గడిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి


దొడ్డబళ్ళాపుర, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆలయానికి వెళ్లేందుకు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై వెళ్తున్న దంపతులను క్యాంటర్ ఢీకొన్న ఘటనలో ఇరువురూ మృతి చెందారు. సోమవారం సాయంత్రం సుమారు 6.30 గంటలకు తాలూకాలోని కన్నమంగల గేట్ సమీపాన పెట్రోల్‌బంక్ మలుపు వద్ద ప్రమాదం జరిగింది. రామదేవనహళ్ళి నివాసి అన్నదానప్ప (66), నాగ రత్నమ్మ (55)లు మృతి చెందారు. మధురె ప్రాంతంలోని శని మహాత్ముడి ఆలయానికి వెళ్లేందుకు రామదేవనహళ్ళి నుంచి వెళ్తుండగా పెట్రోల్‌బంకు సమీపాన మలుపులో క్యాంటర్ ఒక్కసారిగా ఢీకొంది. దంపతుల తలకు తీవ్రమైన గాయాలై రక్త స్రావమైంది. వెంటనే స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించినా చికిత్స ఫలించక మృత్యువాత చెందారు. ప్రమాదంపై దొడ బెళవంగల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఘటనాస్థలాన్ని ఏఎస్పీ నాగేశ్, డీఎస్పీ రవి, దొడ్డ బెళవంగల స్టేషన్ సీఐ కల్లప్ప శంకరప్ప ఖరాత్‌లు పరిశీలించి ఆసుపత్రికి వెళ్లి ఘటనపై ఆరా తీశారు.

కంది పంట దగ్ధం

రాయచూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా గోరేబాళ శివారులో చేతికొచ్చిన కందిపంట మంగళవారం అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన రైతు ఆంజనయ్య నాలుగు ఎకరాల్లో సాగు చేసిన కంది పంటను ఇటీవలే కోత కోసి చేసి కందులను మిషన్‌కు వేయాలని రాశిగా పొలంలో ఉంచాడు. సోమవారం అర్ధరాత్రి సమయంలో ఆకస్మికంగా నిప్పంటుకుని ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమీప పొలాల్లో ఉన్న రైతులు మంటలార్పే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. దీంతో రాశిగా పోసి ఉన్న కంది కుప్పలు మొత్తం కాలి బూడిదైనట్లు రైతు వాపోయారు. నెలలుగా కష్టపడి చేతికొచ్చిన కందిపంట అగ్నికి ఆహుతి కావడంతో రైతు ఆంజనేయ బోరున విలపించాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



కాలిపోతున్న కంది



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1628.00	1,589.54
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	545	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,386	870
నీటి నిల్వ (టీఎంసీలు)	86.73	10.65

తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

సిరుగుప్ప, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆదోని రోడ్డులో వెలసిన తాయమ్మదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రతి మంగళ, శుక్రవారాలు ఎంతో వైభవంగా పూజలు చేపడతారు. భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. అర్చకులు అమ్మవారికి వివిధ అలంకార సేవలు చేసి ప్రత్యేక పూజలు, మహామంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

నేరాల నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బళ్లారి సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణపై పర్యాటకులు, స్థానికులు, విద్యార్థుల, గైడ్‌లు, ఆటో డ్రైవర్లకు హింపి ఎస్‌ఐ శివకుమార్ నాయక్ అవగాహన కల్పించారు. మంగళవారం హింపి టూరిస్ట్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేరాల నియంత్రణ మాస కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు, టూరిస్టుల భద్రత, డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు.

సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



అధ్యక్ష, ఉపాధ్యక్షులకు నియామకపత్రాలు అందజేస్తున్న అధికారులు

సిరుగుప్ప, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహకార నంబర్-1 సంఘం అధ్యక్ష ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శాసనసభ్యులు బీఎం నాగరాజ, ఉపాధ్యక్షులుగా దస్తగిరిసాబ్‌లను ఎన్నుకున్నారు. మంగళవారం సిరుగుప్ప పట్టణ వ్యవసాయ సహకార సంఘంలో ఎన్నిక నిర్వహించారు. గెలుపొందిన వారికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి సన్మానించారు. పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షులు చొక్కా బసన్న గౌడ, డైరెక్టర్లు సిద్దప్ప, శేకప్ప పాల్గొన్నారు.

రోడ్లకు మోక్షం ఎన్నడో?



మట్టి రోడ్డుపైనే జన సంచారం

సిరుగుప్ప, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డులో నేటికీ మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి. నగరసభ అధికారులు ఈ వార్డుపై కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నగరసభ పరిధిలో రానప్పటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు విడుదలవుతున్నా ఇంతవరకు కాలనీలో డ్రైనేజీలు, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉన్నాయి. కాలనీవాసులు నగరసభ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారి ఈ విషయంపై దృష్టిసారించి కాలనీకి ప్రత్యేక గ్రాంటును విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మిర్చి యార్డును ప్రారంభించాలి

● వర్తకుల సంఘం నాయకుల డిమాండ్.. ఆందోళన



ర్యాలీ చేస్తున్న జిల్లా వర్తకుల సంఘం నేతలు

బళ్లారి సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బళ్లారిలో ఎండుమిర్చి మార్కెట్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ వాణిజ్య పరిశ్రమల సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మార్కెట్‌ను ప్రారంభించాలని బళ్లారి జిల్లావర్తక సంఘం అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి విన్నవించాలని డిప్యూటీ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ యడ్యూరప్ప ప్రభుత్వం బడ్జెట్‌లో 23-25 ఎకరాల భూమిని మంజూరు చేసి రూ.100కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ ప్రభుత్వానికి కొత్త డిమాండ్‌ను సమర్పించడం లేదని, ఐదేళ్ల క్రితం బడ్జెట్‌లో ప్రకటించారని దానినే అమలు చేయాలన్నారు. బెళగావిలో జరిగిన శీతకాల సమావేశంలో దీనిని ప్రశ్నించగా... బళ్లారిలో ఎండుమిర్చి మార్కెట్‌ను నిర్మించలేమన్నారన్నారు. ఏపీఎంసీలనే ఎండు మిర్చి మార్కెట్ ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం సమాధానం ఇచ్చిందన్నారు. బళ్లారివాసులు కోరుకునేది ఎండుమిర్చికి ప్రత్యేక మార్కెట్ కావాలన్నారు. బళ్లారిలో 50 నుంచి 60కోల్డ్ స్టోరేజీలుఉన్నాయని, మరిన్ని కోల్డ్‌స్టోరేజీలు నిర్మిస్తున్నారన్నారు. ఎండు మిరపకాయలను విక్రయించడానికి 400కి.మీ దూరంలో ఉన్న బ్యాడగి, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు మార్కెట్‌పై ఆధారపడుతున్నారన్నారు. బళ్లారిలో అత్యాధునిక ఎండుమిర్చి మార్కెట్‌ను నిర్మించడం వల్ల బళ్లారి, రాయచూరు, యాదగిరి, కొప్పళ, విజయనగరం, ధావణగెరె జిల్లాల రైతులు బళ్లారికి సులభంగా, త్వరగా పంటను విక్రయించడానికి వీలుంటుందన్నారు. నగరంలోని ఏపీఎంసీ మార్కెట్ వద్ద ఉదయం 8గంటలకు నిరసన దీక్ష చేపట్టారు. ఏపీఎంసీ పరిధిలోని వ్యాపారులంతా తమ దుకాణాలు బంద్ చేసి నిరసనలో పాల్గొన్నారు. డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ జుబేర్ వినతి పత్రాన్ని స్వీకరించి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. దళాలీ వర్తకుల సంఘం,కన్నడ నాడు రైతుసంఘం, బళ్లారి వ్యవసాయోత్పత్తి మార్కెట్ కమిటీ వ్యాపారుల సంఘం, బళ్లారి వ్యవసాయోత్పత్తి మార్కెట్ కమిటీ,హమాలీల సంఘాలు పాల్గొన్నాయి. బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల శాఖ గౌరవకార్యదర్శి కేసి.సరేశ్‌బాబు, మాజీ అధ్యక్షుడు మహారుద్రగౌడ, శ్రీనివాసరావు, సీనియర్ ఉపాధ్యక్షుడు అవ్వారు మంజునాథ్, దొడ్డనగౌడ, సొంతగిరిధర, సంయుక్త కార్యదర్శులు మల్లికార్జున గౌడ, రామచంద్ర,కోశాధికారి పాలన్న, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ జుబేరాకు వినతి పత్రం అందజేత

16 నుంచి డిప్యూటీ లోకాయుక్త పర్యటన

బళ్లారి సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక డిప్యూటీ లోకాయుక్త జస్టిస్ బి. వీరప్ప జనవరి 16, 17, 18 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారని డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. స్థానిక జిల్లాకలెక్టర్ కార్యాలయంలోని కేస్వాన్ వీడియో హాల్లో జిల్లాస్థాయి అధికారులతో మంగళవారం నిర్వహించిన ముందస్తు సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక లోకాయుక్తలో పెండింగ్‌లో ఉన్న కేసులపై డిప్యూటీ లోకాయుక్త విచారణలు, సమావేశాలను నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని, ఇప్పటి వరకు నమోదైన ఫిర్యాదుల కేసులు, వాటి పరిష్కార సమాచారంతో పాటు అవసరమైన సమాచారంతో హాజరుకావాలని ఆయన సూచించారు. లోకాయుక్త కేసులు పరిష్కరించకుండా పెండింగ్‌లో ఉంటే తగిన కారణాన్ని డిప్యూటీ లోకాయుక్త దృష్టికి తీసుకెళ్లాలన్నారు. చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ పారవేయడానికి అనుమతించపోతే ఫిర్యాదుదారుకు బ్యాక్ లెటర్ ఇవ్వాలన్నారు. ఉపసంహరణకు సంబంధించి అవసరమైన పత్రాలను సంబంధిత శాఖ అధికారులు కలిగి ఉండాలన్నారు.

డిప్యూటీ లోకాయుక్త ద్వారా వీడియో కాన్ఫరెన్స్

జిల్లాకు రానున్న కర్ణాటక డిప్యూటీ లోకాయుక్త జస్టిస్ బి.వీరప్ప సోమవారం సాయంత్రం జిల్లాస్థాయిలో వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమాచారం రాబట్టారు. సాంఘిక సంక్షేమ శాఖ అధ్వర్యంలో అన్ని హాస్టళ్లలో పరిశుభ్రత, మరుగుదొడ్లు, డార్మిటరీ కాంపౌండ్ సిస్టమ్‌తో పాటు



అధికారులతో చరిస్తున్న డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

అవసరమైన మౌలిక సదుపాయాలు సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారులతో మహాత్మాగాంధీ ఉపాధి పథకం(నరేగా), స్వచ్ఛభారత్ మిషన్ పథకాలపై సమాచారం తెలుసుకున్నారు. రెవెన్యూ డీఎంఎస్ గనులు, భూవిజ్ఞానశాఖ, జెస్కాం,రవాణా,ఆహార, ఎక్సైజ్ , ఆరోగ్య, వ్యవసాయ, ఉద్యానవన శాఖలను సంప్రదించి అధికారులందరి నుంచి సమాచారం తెలుసుకుని ప్రభుత్వ పథకాలను ప్రజలకు సకాలంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాహుల్ శరణప్ప, కర్ణాటక లోకాయుక్త బళ్లారి డివిజన్ పోలీస్ సూపరింటెండెంట్ సిద్ధరాజు, అదనపు జిల్లాకలెక్టర్ మహమ్మద్ జుబేర్, ఏఎస్పీ నవీన్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పేదలకు వరం.. ఐదు గ్యారెంటీలు

బళ్లారిసిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పేదలకు ఐదు గ్యారెంటీ పథకాలు వరం లాంటివని జిల్లాస్థాయి హామీపథకాల అమలు అధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు చిదానందప్ప అన్నారు. నగరంలోని జిల్లా పంచాయతీ హాల్లో మంగళవారం ప్రభుత్వ హామీ పథకాల ప్రగతి సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. హామీ పథకాలకు దూరంగా ఉన్న అర్హులైన లబ్ధిదారులను గుర్తించి హామీ పథకాలు అందజేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో జిల్లాలో హామీ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి నూరుశాతం ప్రగతి సాధించేలా చర్యలు చేపట్టి రాష్ట్రంలోనే ప్రథమ స్థానానికి చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తాలూకా హామీ పథకాల అమలు కమిటీ సభ్యులు కరిబసప్ప, ఆశాలత, సోమప్ప, గోనాల్ నాగభూషణ్‌గౌడ్, నాగేనహళ్ళి మల్లికార్జున, జిల్లా పంచాయతీ ఉప కార్యదర్శి గిరిజా శంకర్, ప్లానింగ్ అధికారి ప్రమోద్, ఆహార శాఖ ఉప సంచాలకులు సకీనా, జిల్లా ఉపాధి అధికారి హట్టప్ప పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న చిదానందప్ప, అధికారులు

వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం

● న్యాయాధికారి విద్యాధర్ శిరహట్టి

బళ్లారి సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల రక్షణ చట్టం-1986పై అవగాహన అవసరమని జిల్లా సెషన్స్ కోర్టు మెదటి అదనపు న్యాయాధికారి విద్యాధర శిరహట్టి అన్నారు. జిల్లాపరిపాలన, జిల్లాపంచాయతీ, ఆహార పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ, న్యాయశాఖ, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కారవేదిక, జిల్లా న్యాయ సేవల అథారిటీ, జిల్లా బార్ అసోసియేషన్, సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో నివసించే ప్రతి ఒక్కరూ ఏదో ఒక విధంగా వ్యాపార లావాదేవీల్లో పాల్గొంటున్నారన్నారు. పరిశుభ్రమైన గాలి, వెలుతురు నీరు కోరుకున్నట్టే కొనుగోలు చేసే ప్రతి వస్తువులో నాణ్యంగా ఉండాలని డిమాండ్ చేయడం వినియోగదారుల కర్తవ్యమని అన్నారు. వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా యుగం వినియోదారులు తమ అరచేతిలో మొబైల్‌ను ఉపయోగించి నిత్యావసర వస్తువులను కొనుగోలు చేస్తున్నారన్నారు. ఆన్‌లైన్ లావాదేవీల్లో మోసం మోసం జరిగే అవకాశం ఉందని, న్యాయపరమైన అవగాహన ఉండాలని విద్యార్థి-వినియోగదారులకు సూచించారు. యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ మునిరాజు మాట్లాడుతూ ఇటీవలి రోజుల్లో విద్యావంతులైన వినియోగదారులు ఎక్కువగా నష్టపోతున్నారని, వారు మేల్కోవాలన్నారు. వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఛైర్మన్ తిప్పేస్వామి మాట్లాడుతూ చెల్లించి సేవలు పొందే వారందరూ వినియోగదారులేనన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ప్రకాశ్, విజయనగరం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ రికార్డు సెక్షన్ రుద్రేశ్, న్యాయాధికారి ఇబ్రహీం ముజావర్, అమృత చవాన్, ఆహార పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ సకీనా పాల్గొన్నారు.



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి



విద్యుద్దీపాలకరణలో సెయింట్ మేరీస్ చర్చి

క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చిలు

బళ్లారిరూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా పలు చర్చిలు ముస్తాబయ్యాయి. తెలుగు చర్చిలతో పాటు సెయింట్ మేరీస్ ఓపీడీ సమీపంలో ఉన్న చర్చిలు బుధవారం క్రిస్మస్ సందర్భంగా విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

బళ్లారిలో అఖిల భారత కన్నడ సాహిత్య సదస్సు



మాట్లాడుతున్న జిల్లా కన్నడసాహిత్య అధ్యక్షుడు నిష్టిరుద్రప్ప

బళ్లారి సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సరిహద్దు ప్రాంతమైన బళ్లారిలో 67 ఏళ్ల తర్వాత 88వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పరిషత్ జిల్లాధ్యక్షుడు నిష్టిరుద్రప్ప తెలిపారు. నగరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం అంటే 1920లో రొద్ద శ్రీనివాసరాయల అధ్యక్షతన అఖండ జిల్లా హొస్పేట్‌లో తొలిసారిగా 6వ సదస్సు నిర్వహించారన్నారు. రెండో 1926మే 22న నుంచి 24వరకు మూడు రోజుల పాటు నగరంలో 12వ సదస్సు జరిగిందన్నారు. 23వ కన్నడ సాహిత్య సమ్మేళనం మూడవసారి 1938లో దివాకర్ అధ్యక్షతన నిర్వహించినట్లు తెలిపారు. 1947లో సికే.వెంకటరామయ్య అధ్యక్షతన హర్పనహళ్ళిలో నాలుగోసారి, 1958లో 5వసారి బళ్లారి మున్సిపల్ మైదానంలో గోకాక్ అధ్యక్షతన జరిగిందన్నారు. 87వ సదస్సును బళ్లారిలో నిర్వహించాలనే డిమాండ్ గత హావేరిలో జరిగిన సదస్సులో బలంగా వినిపించింది. అయితే చివరి క్షణంలో మండ్యలో సదస్సును నిర్వహించాలని నిర్ణయించారన్నారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ కన్నడిగుల 88వ సదస్సును బళ్లారినగరంలో నిర్వహించాలని జిల్లా కార్యవర్గం నిర్ణయించింది. మూడు రోజుల పాటు మూడు వేదికలపై నిర్వహించనున్నారు. వచ్చేనెలలో రిసెప్షన్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హంపనగౌడ, సిద్ధరామకల్మఠం, మండలి జిల్లాకార్యదర్శి శివలింగప్ప, చోరనూర్ కొట్రప్ప, బసవరాజ్ గడగిన్, నాగిరెడ్డి, కోలూరు వెంకటేష్ హెగ్డే పాల్గొన్నారు.

పట్టుదల, దీక్షతోనే ఉత్తమ ఫలితాలు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విద్యార్థిని

కంప్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు పట్టుదల, దీక్షతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ధర్మస్థల గ్రామీణాభివృద్ధి యోజన అధికారి హాలప్ప అన్నారు. తాలుకా పరిధిలోని దేవసముద్రం గ్రామంలో బీసీ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళా జ్ఞానవికాస్ కార్యక్రమంలో పది విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదివే విద్యార్థులకు ధర్మస్థల గ్రామీణాభివృద్ధి బీసీ ట్రస్టు ప్రత్యేక ట్యూషన్ క్లాసులు ఏర్పాటు చేసిందన్నారు. ముగ్గురు ఉపాధ్యాయులను నియమించామన్నారు. విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చి మంచి ఫలితాలు వచ్చేలా విద్యనందిస్తారన్నారు. శకుంతల, గ్రామ పంచాయతీ సభ్యులు వెంకోబ, ఉపాధ్యాయులు హిరేస్వామి, సోమలింగమ్మ, రేఖ, వనజాక్షమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రిని బర్తరఫ్ చేయాలి



అంబేడ్కర్ చిత్రపటాలతో నిరసన తెలుపుతున్న సంఘ పదాధికారులు

కంప్లి, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర మాహిత్య హక్కు, సామాజిక కార్యకర్తలు, ఆది జగద్గురు రేణుకాచార్య సేవా ట్రస్టు ఆధ్వర్యంలో కంప్లి పట్టణంలో ర్యాలీ చేపట్టారు. గంగా నగర్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది.. టీహెచ్‌ఎం రాజ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా వుండి ఇలా మాట్లాడటం సరికాదన్నారు. అతనిని వెంటనే బర్తరఫ్ చేయాలని లేదా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. గోపాల్, శ్రీనివాస్, మౌలా హుస్సేన్, రఫీక్, లక్ష్మన్న, వసంత్ కహళే, రవి మున్నూరు. బుజ్జి కుమార్, వీరేష్, బసవరాజు, శ్రీనివాస్, మర్రిస్వామి, ధనుంజయ, అరుణ్, శాంతప్ప పూజారి, మంజు పాల్గొన్నారు.

నేడు చీకటి బతుకులు తెలుగు నాటిక ప్రదర్శన

బళ్లారి సిటీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలో రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వర్గీయ భీమప్పశెట్టి జయంతి సందర్భంగా 'చీకటి బతుకులు' అనే సందేశాత్మక తెలుగు నాటక ప్రదర్శనను బుధవారం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. జీఆర్ వెంకటేశులు దర్శకత్వం వహించిన చీకటి బతుకులు అనే తెలుగు నాటక ప్రదర్శన బుధవారం సాయంత్రం రాఘవ కళామందిరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పుష్ప చంద్రశేఖర్‌కు భారత సేవారత్న అవార్డు

బళ్లారిరూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బళ్లారి మాతృ ఫౌండేషన్ సంస్థాపకురాలు పుష్ప చంద్రశేఖర్‌కు భారత సేవారత్న అవార్డు లభించింది. బెంగళూరు మెజిస్టిక్ సమీపంలో ఉన్న సంచారియాలో ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన వారిని గుర్తించి బెంగళూరు మాతృ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారత్ సేవారత్న పురస్కారం అందించారు. బళ్లారి మాతృ ఫౌండేషన్ అధ్యక్షురాలు పుష్ప చంద్రశేఖర్ యువ సబలీకరణ, క్రీడా భారత్ సర్కార లోకేశ్వర్ నాయక్, కుమారి నిక్షిత, గోవర్ధన్ దేశాయి, జనార్ధన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. ఐదుగురికి గాయాలు

రాయచూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మర్చెడ్ క్రాస్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హొస్పేట్ నుంచి వేగంగా వస్తున్న కారు ఒకటి మర్చెడ్ నుంచి రాయచూరువైపు వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. నగరానికి చెందిన వీరంతా ఆటోలో ప్రయాణిస్తున్నారు. వెనకనుంచి వచ్చిన కారు వేగంగా ఢీ కొనడంతో ఆటో బోల్తాపడి ప్రమాదం జరిగింది. డ్రైవర్ అతివేగంగా కారు నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి హొస్పేట్‌కు చెందిన మధుసూధన్(40)గా గుర్తించారు. బీరలింగప్ప అనే వ్యక్తికి కాలు విరిగిపోగా ఆయనను చికిత్స కోసం బళ్లారిలోని విమ్స్ ఆస్పత్రికి తరలించారు. మిగిత క్షతగాత్రులు నాగమ్మ, బసమ్మ, ఉమాదేవి, సురేశ్ చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



చికిత్స పొందుతున్న బాధితుడు

హోసూరు జోన్

ఎంజీఆర్‌కు ఘన నివాళి



ఎంజీఆర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అభిమానులు

హోసూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్‌కు మంగళవారం ఘన నివాళులు అర్పించారు. 37వ వర్ధంతి సందర్భంగా కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఎంజీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ముఖ్యమంత్రిగా ఆయన అందించిన సేవలను వక్తలు ప్రస్తావించారు. సినీరంగంలోనూ సత్తా చాటుకున్నారన్నారు. కృష్ణగిరి పశ్చిమ జిల్లా వేపనపల్లి, హోసూరు అసెంబ్లీ నియోజకవర్గం బేరికై, అత్తిముగం బస్టాండు వద్ద వేపనపల్లి అసెంబ్లీ నియోజకవర్గం విప్లవ నాయకుడు ఎంజీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మునుస్వామి, వెంకటాచలం బాబు, మునిచంద్రన్, కేవన్ డొడ్డి కౌన్సిల్ అధ్యక్షుడు శారది, మంజు, సహకార సంఘం ఛైర్మెన్, అత్తిముగం పంచాయతీ కౌన్సిల్ అధ్యక్షుడు అన్నాడీఎంకే కౌన్సిల్ యూనియన్ కార్యదర్శి సురేశ్, ఎంజీఆర్ ఫోరం సెక్రటరీ మునిగౌడు, నాగేశ్, పంచాయతీ కౌన్సిల్ మాజీ ఛైర్మెన్ వెంకటేశపురం తదితరులు పాల్గొన్నారు.

వన్నియార్ రిజర్వేషన్ అమలుకు డిమాండ్



నిరసనలో పీఎంకే నాయకులు

హోసూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వన్నియార్ కులాలకు 10-50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట పిఎంకే పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శి గోవిందరాజు అధ్యక్షత వహించి మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తమిళనాడు ప్రభుత్వం వన్నియార్ కులస్తులకు రిజర్వేషన్లను వెంటనే అమలు చేసేంత వరకు నిరసన కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వం వెంటనే కులాల వారీగా జనాభా గణన చేపట్టాలన్నారు. నిరసనలో బీఎంసీ నిర్వాహకులు మునిరాజు, అరుణ్‌రాజు, వెంకటేశ్, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల సంచారంపై అధికారుల హెచ్చరిక

హోసూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని మత్తిగిరి పశువుల ఫారం ప్రాంతంలో సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం నుంచి 5 ఏనుగులు వచ్చినట్టు స్థానికులు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇక్కడి నుంచి సానమావు అటవీ ప్రాంతానికి తరలించాలని గ్రామస్తులు కోరారు. కెలమంగళం రహదారి, అగ్గొండపల్లి, సూతాళం, కుందుమారనపల్లికి చెందిన ప్రజలు ఏనుగుల సంచారం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కొండపల్లి, మంజలగిరి, చిన్నట్టి పరిసర ప్రాంతాలలోని రాగుల పంటలను ఏనుగులు ధ్వంసం చేసినట్టు తెలుస్తోంది.



విద్యుద్దీపాలతో చర్చి అలంకరణ

క్రిస్మస్ సందడి

హోసూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ నేపథ్యంలో హోసూరు నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలలోని చర్చ్‌లను విద్యుద్దీపాలతో అలంకరించారు. హోసూరు సమీపంలోని మత్తిగిరిలో శతాబ్దాల నాటి అవర్‌లేడీ ఆఫ్ ప్యూర్ హెల్త్ చర్చ్‌లో భక్తుల సందడి నెలకొంది. ఏసుక్రీస్తు జన్మదినాన్ని ప్రతిబింబించేలా గోశాలను ఏర్పాటు చేశారు. చర్చ్‌ను రంగురంగుల దీపాలు, పూలతో అలంకరించారు. అలాగే క్రిస్టియన్ల ఇళ్ల ముంగిట స్టార్‌లైట్‌లు ఏర్పాటు చేశారు. క్రిస్మస్ చెట్లను రంగురంగుల అలంకరణ వస్తువులతో అలంకరించి క్రిస్మస్ ట్రీను ఏర్పాటు చేశారు. మత్తిగిరి చర్చిలో మతబోధకులచే భక్తి గీతాలు ఆలపించి బైబిల్ సందేశాలు వినిపించారు. ఇలా అన్ని చర్చ్‌ల వద్ద సందడి నెలకొంది.

కేక్‌లకు పెరిగిన డిమాండ్

హోసూరు(సిప్‌కాట్) డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ నేపథ్యంలో కేక్‌లకు డిమాండ్ పెరిగింది. హోసూరు నగరంలోని పలు బేకరీ దుకాణాలలో మంగళవారం కేక్‌ల విక్రయాలు జోరుగా సాగాయి. చర్చ్ వద్ద సందడి నెలకొనగా ఇళ్ల ముంగిట కూడా క్రిస్మస్ ట్రీ, స్టార్‌లు ఏర్పాటు చేశారు. క్రిస్మస్‌కు బంధుమిత్రులకు కేక్‌ను పంచిపెట్టడం ఆనవాయితీ ఉండడంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. బ్లాక్ ఫారెస్ట్, చాక్లెట్ కేక్, స్ట్రాబెర్రీ కేక్, టూటీ ఫ్రూటీ కేక్, క్రీమ్ కేక్‌లు ఇలా వివిధ రకాల కేక్‌లను తయారు చేసి విక్రయానికి ఉంచారు. కిలో రూ.400 ధరగా ఉంటోంది. ఐస్ క్రీమ్ కేక్, ఇతరత్రా అయితే ధర మరింత ఎక్కువగానే ఉంది. మంగళవారం మధ్యాహ్నం నుంచే కేక్‌ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.



కేక్‌లు తయారు చేస్తున్న దృశ్యం